# కథ

# దొంగ

కొలకలూరి ఇనాక్

ప్యాంట్ జేబులోని మనీ పర్సును బయటకు తీస్తున్న చేయి పట్టుకొని, 'దొంగ, దొంగ' అని అరిచి, వణుకుతున్న చేతినీ, మనిషినీ చూస్తూ, 'దొంగ, దొంగ' అని, దొంగచేయి జేబులోంచి వెలుపలకి తీసి, పర్సు జేబులో భద్రంగా వుంచుకొని 'దొంగ నా కొడకా పర్సు కొట్టేద్దామని చూస్తున్నావా?' అంటూ ముఖం మీద గుద్దాడు.

దొంగ పడబోయి నిలబడ్డాడు. పారిపోయే మార్గం లేదు. రైలు కంపార్టుమెంటులో వెనక్కు జరిగాడు. అప్పుడే బయలుదేరింది రైలు. దొంగ వెనక్కు తగ్గగానే యువకుడు ముందుకు వచ్చాడు. కాలెత్తి తన్నబోయాడు. ఖాళీ లేదు. దొంగ జుట్టు పట్టుకొని విదిలించి కొట్టాడు. మెడ వంచి వీపు మీద పిడిగుద్దులు గుద్దాడు.



కంపార్ట్‌మెంటు కిక్కిరిసి వుంది. కాలుకదలడం లేదు. చేయి కదలడం లేదు. అయినా పట్టుకొని కోపంతో యువకుడు వృద్ధుడ్ని పొడుస్తున్నాడు. పిడికిలితో, చెంపలు వాయిస్తున్నాడు. రెండు అరిచేతులతో చరుస్తున్నాడు.

రైలు ఇరకాటంగా వుండడం వల్ల, కాళ్లతో తన్నలేక, చేయి చాచి తృప్తిగా కొట్టలేక, కోపంతో రొప్పుతూ తిడుతున్నాడు.

దొంగ దొరికితే చావబాదే జనం అక్కడి దాకా రాలేక, ముసలివాడిని కొట్టలేక, ఈ వినోదం ఇష్టంలేకో, ఎక్కడి వాళ్లు అక్కడే వుండి 'ఏవాయ? ఏవాయ?' అని యథాలాపంగా అడుగుతున్నారు. 'ఏవాయనా?' దొంగ నా పర్సులో దుడ్డు దొబ్బాలని- దొంగనా కొడుకు, మూతి బిగలనూకితేసరి'...

'దుడ్డుపోయినా?''

'లే జేబిలో చేయి పెట్నా, నేబడితి'

'లెక్క పోలే గదా!సొల్లే మడి!'

'పోలే!'

'లెక్క బద్రం పాపోడా!'

'మడి పోనిత్తానా? బద్రవే! బద్రవే' అని యువకుడు పేంటు జేబులో పర్సు తడిమి చూసుకొని, 'పర్సుపోలె'అన్నాడు.

యువకుని డబ్బు భద్రంగా అతడి పర్సులో పేంటు జేబులో క్షేమంగా వున్నందుకు అందరికీ ఊపిరి ఊపుగానే ఆగింది. 'పోల్లే అప్పయ్యా నీ లెక్క నీ కాడే వుండే. మడికనేం?' అని సముదాయించారెవరో.

'నెల జీతం బిడ్డల నోటికాడి కూడు-దొంగనా కొడుకు, వాళ్ల నోల్లల్ల దుమ్ము గొట్టే నా కొడుకే' అని చెంప మీద చేయి చాచి కొట్టాడు.

'ముసిలోన్ని యాల సంపబట్టినవ్‌రా పాపోడా? సాల్ సాల్లే. ముసిలి ముంపు సచ్చీని'అన్నారెవరో. యువకుడు ఆగిపోయాడు. చేయెత్తడం లేదు. కొట్టటం లేదు. నోరెత్తటం లేదు. తిట్టటం లేదు. కానీ కనురెప్పలెత్తాడు. చూపులు కత్తుల్లై ముసలాడి గొంతు కోసినట్లు, గండ్రగొడ్డలై నిలువెల్ల నరికినట్లు, వేటకొడవలై మెడ కోసి చేత పట్టినట్లు, ఉరిమి ఉరిమి చూస్తున్నాడు. అంతటితో ఆగలేదు. కాండ్రించి ఉమ్మి నోట్లోకి తెచ్చుకొన్నాడు. ముసలి వాడి ముఖం మీద, ఉమ్మి వేద్దామంటే మధ్యలో రెండు ముఖాలు అడ్డం వచ్చేటట్లు వున్నాయి. వాళ్ల ముఖాల మీద గురి తప్పి పడితే, ఇంకేమన్నా ఉందా? అందుకే వంగి, కిటికీ వెలుపలికి ఉమ్మివేశాడు. ఉమ్మివేసి ఊరుకోలేదు. 'ఈ బతుకేల? యాణ్నో రైలు కింద తలబెట్టి సాయి' అని శపించాడు.

ముసలివాడు తలవంచుకునే ఉన్నాడు. దెబ్బలు తప్పించుకోలేదు. చేతులు అడ్డం కూడా పెట్టకుండా ఎండిపోయిన మానులా వున్నాడు. కొట్టవద్దు అని కూడా అడగలేదు. అంత మౌనంగా వున్న మనిషి కళ్లు ఊరికే ఉండలేదు. ఊరుతున్నాయి. నీరై కారుతున్నాయి. కన్నీరై జారుతున్నాయి. చెంపల మీద మేర మీరుతున్నాయి. ముఖం అంతా పారాడుతున్నాయి. తిరిగే తీరు తెలియక పడి పోతున్నాయి. ఎదుటి వాళ్ల భుజాల మీద, చేతులమీద బొట్లుగా పడుతున్నాయి.

అది వానపడే కాలం కాదు. కాలువలు వచ్చే వేళ కాదు. బావులెండి, బోర్లెండి, రిగ్గులెండి, పంటలెండి, నీటి చుక్క కనపడని నేల మీద పోతున్న రైలులో ఎండిపోయిన అస్థిపంజరం వంటి మనిషి కళ్లల్లో, శరీరంలో అంత కన్నీరు ఎక్కడుందో? ఉన్న కాస్తంత రక్తం కన్నీరై కారిపోతే మనిషి ఏమైపోతాడో!

గుంతకల్ నుంచి హిందూపురం పోయే పాసింజరు బండిలో కల్లూరులో రైలెక్కిన యువకుడు, వృద్ధుడు రష్‌గా వున్నా ఎట్లాగో వీలు చూసుకొని, వేలు బట్టి, కాలు బెట్టి నిలబడ్డప్పుడు యువకుడి పర్సు వృద్ధుడు తీయబోయి, దొరికిపోయి దెబ్బలు తిన్నాడు.

యువకుడి చేతికి దొరక్కపోతే, పర్సు చేతికి దొరికించుకుంటే దెబ్బలు తింటున్న సమయంలో ముసలివాడు రోడ్డు పక్క బంకులో సంకటి తింటూ వుండేవాడు. ఏమీ తినక మూడు రోజులయింది.

ముసలివాడు ప్రయాణం చేయాలని రైలు స్టేషన్‌కు రాలేదు. ఎవరైనా ఏమయినా పెడితే తిందామని, లేదంటే ఎవరైనా ఏదైనా పని చెబితే చేసి ఇచ్చింది తీసుకొని, ముసలి భార్యకు ఏమ

ముసలివాడు తలవంచుకునే ఉన్నాడు. దెబ్బలు తప్పించుకోలేదు. చేతులు అడ్డం కూడా పెట్టకుండా ఎండిపోయిన మానులా వున్నాడు. కొట్టవద్దు అని కూడా అడగలేదు. అంత మౌనంగా వున్న మనిషి కళ్లు ఊరికే ఉండలేదు. ఊరుతున్నాయి. నీరై కారుతున్నాయి. కన్నీరై జారుతున్నాయి. చెంపల మీద మేర మీరుతున్నాయి.

యినా తీసుకొని పోదామని ఆశపడుతూ వచ్చాడు.

అడుక్కోవడం అయినా ఈరోజే మొదలయ్యేది. కూలీ (లగేజ్) మోయడమైనా ఈవేళ ఆరంభమయ్యేది. దొంగిలించే ప్రయత్నం కూడా ఈ పొద్దే వరుసపెట్టేవాడు. కానీ ఏదీ జరగలేదు.

పర్సులో డబ్బు పదిసార్లు లెక్కబెట్టుకుంటూ యువకుడు కనపడకపోతే ఆ దుడ్డు దొంగిలిద్దామన్న బుద్ధి పుట్టకపోయేదేమో! ఆ జేబులో ఈ చేయి ఎప్పుడు పెట్టి, ఎప్పుడు పర్సు బయటకు తీయాలా? అని చూస్తున్నప్పుడు రైలు వచ్చింది. యువకుడు ఎక్కసాగాడు. వృద్ధుడు వెంట వచ్చాడు. రైలు వాకిట్లొంచి ఎవరూ కదలడం లేదు. ఎట్లో యువకుడు దూరాడు. వెంట వృద్ధుడు చేరాడు.

యువకుడు తెలివైన వాడో, వృద్ధుడు, ఆలవాటు అయిన పనికాకపోవడం వల్లనో, చాతకాని వాడో, దొరికిపోయాడు. దెబ్బలు తిన్నాడు. కన్నీరు కారుస్తున్నాడు. ముసలివాడు ఆరడుగుల మనిషి. కాయపారు శరీరం. ఎముకల పంజరం పెద్దది. కండ లేదు. కానీ చర్మం రాటు తేలి వుంది. కాయకష్టం చేసిన వళ్లు వంగిపోయినా నిట్రాడిలా ఎత్తుగానే వున్నాడు.

యువకుడు పిట్ట మనిషి. ఏదో కొంచెం చదివినట్లే వున్నాడు. టక్కు, బూటు, చేతిలో మందుల సంచి. మెడికల్ రిప్రజెంటేటివ్. పర్సు నిండా పొత్తులు పొత్తులుగా డబ్బు. దొంగతనం చేయబోయి దొరికిపోయి, దెబ్బలు తిన్నాడు కానీ, వృద్ధుడు గట్టిగా పట్టుకుంటే యువకుడు ఊపిరాడక చచ్చి ఊరుకుంటాడు. లేకపోతే వృద్ధుడిని కొట్టే శక్తి యువకుడికి ఎక్కడిది? మౌనంగా దెబ్బలు భరించిన వృద్ధుడికి కన్నీరు ఆగిపోలేదు. అది లావానో ఏమో, లోపలెన్ని అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయో!

డెబ్బై ఏళ్లు దాటి వుంటాయి. ఏడేళ్ల నుంచి పంట లేదు. పండించే ఓపిక లేదు. ఓపిక ఉన్నా వాన లేదు. చాతగాని దేవుళ్లాగా, భూదేవి కాళ్లార జాపి ఏడుస్తూ ముసలాడి ఎదాన పడి ఎండిపోతూ, దుమ్ము రేగుతూ, దువ్వ నేలగా మారి, క్రిమి కీటకాలు కూడా లేకుండా, ప్రాణి, పంటకదలిక లాగా ఏ కుక్కకూ అక్కరకు రాకుండా పడి వుంది. ఈచేన్లు, ఈ తర్లు వుండి ఏమి? లేక ఏమి? ఈ ఏడేళ్లలో పశువులూ, పనిముట్లు, వస్తువులు అన్నీ అంతరించిపోయాయి. ఖాళీ కొంప, కదిలే శవాల్లాంటి భార్యభర్త అంతే ఇల్లు. కొడుకులిద్దరూ ఏవూరో పోయారు. ఏవో పనులు చేసుకుంటున్నారు. బ్రతికి ఉన్నారో లేదో! ఉత్తరం లేదు పత్తరం లేదు. ఊం లేదు..... ఆం లేదు. వచ్చేదీ లేదు. చూసేది లేదు. పంపేది లేదు. పట్టించుకునేది లేదు. తాళి కట్టిన నేరానికి భార్యను, పసుపు కుంకుమలిచ్చిన పుణ్యానికి భర్తను ఒకరినొకరు చూసుకొని, కరుసుకొని, ఏడుసుకొనేది మిగిలి వుంది. ఆ ఏడుపులోనే కల్లూరు స్టేషన్‌లో కదలిక వుందని వచ్చాడు వృద్ధుడు.

పల్లెలో యువకులు గుంతకల్‌కో, అనంతపురానికో, హైదరాబాద్‌కో, బెంగుళూరుకో వెళ్లిపోయారు. ముసలీ ముతకా మిగిలారు. అందరూ అంతంత మాత్రమే. ఆదుకునే ఆరాటం వున్నా అవకాశం ఏమాత్రం? బాగా బతికిన వాళ్లు పంటి బిగువుతో బండిలాగుతున్నారు. తిన్నా, తినకున్నా, ఏమీ చెప్పుకోలేరు.తిన్నావా? లేదా? అని అడిగే వారు లేరు. ఎవరి తిప్పలు వాళ్లవి.

'దొరా కట్టపడి బతికినోన్ని, ఎన్నడే గాని దొంగపని చేసిండలా'అన్నాడు వృద్ధుడు కన్నీరు తుడుచుకొని.

అందరూ విన్నారు. ఎవరూ వినిపించుకోలేదు. అయ్యోపాపం అన్నట్లు ఎవరో చప్పరించారు కానీ పలకరించలేదు.

యువకుడి వళ్లు మండిపోతూ వుంది. నా సొమ్మే కనపడిందా అన్నట్లు మిడిగుడ్లేసుకొని చూశాడు.

''మూన్నాళ్లయింది తినక'' ఎవరూ కనికరించలేదు. తినమని ఏమీ ఇవ్వలేదు.

'సరిపడ దెబ్బలు తిన్నావులే'అన్నట్లు ఎగతాళిగా చూశారు.

'ఎన్నెట్లేసేవు అప్పయ్య' అన్నాడు యువకుడిని ఉద్దేశించి.

'కొట్టాల్లా? సంపాల్లా?' అంటూ ఉరిమి చూశాడు యువకుడు.

'కొట్టిన కాడికి సాల్లేవై. పోటు మొగోనివి ఎల్లుకొచ్చినవ్' అని ఎవరో గదమాయించారు. యువకుడు మౌనంగా ఉండిపోయాడు.

పాత మాసికల అంగీ రద్దీవల్లో, దెబ్బలవల్లో గూటిమీద చిరిగిపోయింది. బొంతలాగా, కుట్టీ కుట్టీ మారిపోయిన పంచె జారిపోకపోతే మానం కాపాడుతుంది. కనుగుడ్ల గుంతల్లోకి కళ్లు పీక్కుపోయాయి. డొక్క వెన్నుముకకు అతుక్కుపోయింది. చర్మం ఇనప కమ్మీల మీద ఆరేసిన మసిగుడ్డలాగా వుంది.

'ఇన్నేట్లేసినావే, ఇంత తిండి పెట్టరాదాయనా?' యువకుడు వృద్ధుడిని చూడడం లేదు. మాట వినడం లేదు. ఎటో చూస్తూ, ఏమో ఆలోచిస్తున్నట్లుగా నిలబడ్డాడు.

అగ్గిపెట్టెలో పుల్లల్లాగా జనం రైలుపెట్టెలో ఒకరినొకరు ఆనుకొని నిలబడ్డారు. వాకిట్లోనూ జనమే! ఎవరు దిగాలన్నా కష్టమే. ఎక్కాలన్నా యజ్ఞమే. రైలు కుదుపు ఎక్కువయింది. బెజ్జంలో మేకు నిలిచినట్లు మనుషులుండడం వల్ల ఎవరికీ ఇబ్బందిగా లేదు.

'వీడేదో, ఇంకా దొంగనాకొడుకులున్నారో ఏమో ఈడ. ఎందుకే గాని మంచిది' అని ప్యాంటు జేబులో పర్సును గట్టిగా పట్టుకొన్ని నిలబడ్డాడు యువకుడు.

'నువ్వే దొంగనాకొడుకువు. ఇగెవరైనా దొంగనాకొడుకులనేది పై బగలల్లా?' అని ఎవరో కల్పించుకొని మందలించారు.

'నిన్నేంగాని, ఏమేగాని అనింటే, లే ఇన్లే, తల్దీత్తా!' మనిషి కనిపించడం లేదు. మాట వినిపించింది.

వృద్ధుడ్ని, ఎముకల పోగును, బతుకు బండలైన రైతును అన్ని దెబ్బలు కొడుతుంటే, దుడ్డు పోయేదన్న బాధతో కొట్టాడని జనం భావించారు. కానీ ఎవరూ చేయి చేసుకోలేదు. వృద్ధుడి దైన్యం, యువకుని దుంకుడు రైలు ప్రయాణికులు భరించలేకుండా వున్నారు. ముసలివాడి పట్ల జాలి, యువకుడి పట్ల కోపం కూడా కలగసాగింది. యువకుడి మాటలు కూడా వినేవాళ్లకు కంపరం పుట్టించసాగాయి.

'పదిమందికి పెట్టినానే కానీ, దేయీ అని బిచ్చమెత్తిందే లేదు.'

'పోన్లే పెద్దాయన. మరిసిపో!' అన్నారెవరో!

'అంత సెద్దెం ఏవైపాయ? అందరు సేద్దెగాల్లు యాడబోయిండిరి?'అని ప్రశ్నించుకొని, 'కాల మయిమ' అని తానే జవాబు చెప్పుకొంటున్నట్లు గొణగసాగాడు వృద్ధుడు. చాలా మందికి సానుభూతి కలిగింది. రైతు జీవితం మారిపోవడం వాళ్లూ చూస్తున్నారు. లేదా అనుభవిస్తున్నారు.

కన్నీళ్లెండిపోయి, గుడ్లెర్రబడి, మంటలాగా కనిపించాడు ముసలాయన. 'ఇన్నేళ్లలో ఎన్నడే గాని ఒక్కేటు పడి ఎరగను. ఎన్నేట్లు పడె? ఎట్టా ఓరిస్తి? యల ఓరిస్తి? కాల మయిమ' వృద్ధుడు నిట్టూర్చాడు.

'ఎందుకు ఇన్నేట్లు తింటి. యాల తింటి. దొంగపనిసెయ్‌బోయి! సెత్తినా? లే! లెక్క సేతికొచ్చేనా? లే! తప్పని, తప్పదని, తలవంచి, దెబ్బలకు ఒప్పితి. ఇది నీతా? తెలివా? చాతగాని చేదవా?' వృద్ధుడు గింజుకోసాగాడు.

'నా బతుకేల ఇట్టా అయినాది? కాల మిట్లా యాల మారిపాయ?' వృద్ధుడు తలపైకెత్తుకొని చుట్టూ చూసి అందరినీ అడిగాడు' మీరైనా సెప్పండి సావులు బతుకులేల బిజీదు బట్టిపాయ. బుగ్గిపాలయి పాయ. వల్లకాటి పాలయ. యాల దేవుళ్లు!'

అందరూ నిట్టూర్చారు. ఎవరూ మాట్లాడలేదు. బీడి పీకి పీకి బుగ్గలు సొట్టలు పడ్డ సన్నాడొకడు నోరూ ముఖమూ కళ్లూ తుడుచుకొని 'నీయమ్మా' అన్నాడు ఎవరినో! దేవుణ్నో, దేశాన్నో, దేశ ప్రజల్నో, వృద్ధుణ్నో, యువకుణ్నో.

గార్లదిన్నె ఔటర్‌లో ఇంజను కూతవేసింది. కూతవేటు దూరంలో స్టేషన్ వుంది. లోపల్నుంచి ఇద్దరు లేచి వస్తున్నారు దిగడానికి. రైలింకా ఆగలేదు. 'దిగనీండి' అంటే ' ఆగనీండి'అన్నారు.

గార్లదిన్నె స్టేషన్‌లో ఎక్కదలచిన వాళ్లు వాకిటి ముందు నిలబడ్డారు. లోపల వాళ్లు దిగాలంటే డోర్ తీయాలి. డోర్ దగ్గరున్న వాళ్లు దిగి లోపలి వాళ్లను దిగనిచ్చి, మళ్లీ ఎక్కాలి. కొత్తగా ఎక్కే వాళ్లతో కలిసి.డోర్‌నాను కొని వున్న నలుగురూ దిగాలి. యువకుడూ దిగాలి. వృద్ధుడూ దిగాలి.

'ఎక్కువసేపాగదు. దిగు దిగు' తొందరచేస్తున్నారు జనం.

నలుగురు తోవ ఇవ్వడానికి దిగారు. దిగవలసిన ఇద్దరూ దిగిపోయారు. నలుగురిలో ముందుగా వృద్ధుడు, మీద పడుతున్నట్లుగా యువకుడు దిగారు. దిగిన నలుగురిలో ఇద్దరు ఎక్కారు. కొత్తగా ఎక్కే నలుగురు ఎక్కారు. వృద్ధుడు , యువకుడు ప్లాట్‌ఫారం మీద వున్నారు.

ఉరిమి చూస్తున్న యువకుడ్ని వృద్ధుడు చేరబిలిసి, మెడపట్టుకొని, చంకలో ఇరికించుకొని, జేబులో చేయి పోనిచ్చి, దాన్ని తీసి చిరిగిన అంగీ ఎదురు జేబులో పెట్టుకొని 'పో'అన్నాడు. చంకలోంచి వదిలిపెడుతూ.

యువకుడు 'నా పర్సు' అన్నాడు. వృద్ధుడు 'చూసుకో' అన్నాడు.

'దొంగ, దొంగ' అన్నాడు యువకుడు.

'పోరా దొంగనా కొడకా' అన్నాడు వృద్ధుడు.

రైలు బయలుదేరింది.

యువకుడు రైలెక్కలేక, వృద్ధుణ్ని పోనివ్వలేక గింజుకుంటున్నాడు. 'దొంగ!దొంగ!'అంటూనే వున్నాడు.వృద్ధుడు యువకుణ్ని చాచి చెంప మీద కొట్టాడు. కళ్లు తిరిగాయి. కదిలే రైలు డోర్ మీద పడ్డాడు. వృద్ధుడు కాలితో నడ్డిమీద తన్నాడు. యువకుడు ఎగిరి డోర్ హ్యాండిల్ కమ్మీ పట్టుకొన్నాడు.

'సత్తావ్' అంటూ లోపలి వాళ్లు యువకుణ్ని లోపలికి లాక్కున్నారు.రైలు వేగం పెరిగింది. యువకుడు 'దొంగ, దొంగ' అని అరుస్తూనే వున్నాడు.

'పోరా దొంగనా కొడకా' అంటూనే వున్నాడు వృద్ధుడు.

రైలు కనుమరగయింది. రైతు వృద్ధుడు కనిపించలేదు.

★

"ఆకాశంలో గ్రహాలు ఎన్ని ఉన్నా వెలుగు నిచ్చేది సూర్యుడొక్కడే
లోకంలో మ్యారేజ్ బ్యూరోలు ఎన్ని ఉన్నా పెళ్లి కుదిర్చేది కాకతీయ ఒక్కటే"

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999


శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com